పాఠశాలల్లో సంబరాల సంక్రాంతి



ఆకట్టుకుంటున్న రంగవల్లులు


పేటబయ్యవరం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు


రాజుపేట ఎంపీయూపీ స్కూల్లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


ఏటికొప్పాక పాఠశాలలో భోగి మంట వద్ద సందడి చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

యలమంచిలి : ప్రభుత్వ పాఠశాలల్లో ముందుగానే సంక్రాంతి సందడి నెలకొంది ఏటికొప్పాక,పేట బయ్యవరం పాఠశాలల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పేట బయ్యవరం పాఠశాలలో జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో మండల విద్యాశాఖాధికారి మీనాక్షి ముఖ్య అతిథిగా పాల్గొని సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ సంక్రాంతి పండగ సంస్కృతి సంప్రదాయాలకు ఒక విశిష్టమైన పండగ అని నైతిక విలువలు,పెంపొందించి కుటుంబాలలో ఐక్యత అనురాగానికి సత్సంబంధాలకు నిదర్శనగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థులందరూ మన సంస్కృతి సంప్రదాయాలు గురించి తెలుసుకోవాలని అన్నారు. విద్యార్థులతో హరిదాసు, గంగిరెద్దు, కొమ్మదాసరి, వేషాలు ప్రదర్శనగా వేయించారు. కుండలో పాలు పొంగించి, రంగవల్లికలు చెరకు గడలతో పూజలు చేసి, భోగి మంటలు వెలిగించి ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు, వంట కార్మికులకు విద్యార్థులు చీరలు అందజేశారు. ఏటికొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు సేనాపతి రాము పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. గాలి పటాలు ఎగురవేశారు. వివిధ సంస్కృతి ప్రదర్శలతో అలరించారు. ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, బోడ్డేడ సత్యనారాయణ, వీరభద్రరావు, రవీంద్ర, ధనలక్ష్మి, కృష్ణవేణి, శ్రీనుబాబు, ఏటికొప్పాక గ్రామ సర్పంచ్ భజంత్రిల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉపాధ్యాయులు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలో వివిధ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పెదబోదిగల్లం, చినదొడ్డిగల్లు, ఎన్.నర్సాపురం తదితర పాఠశాలల్లో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. బోదిగల్లం పాఠశాలల్లో బాల బాలికలతో కోలాటం నిర్వహించారు. సీతంపాలెం, ఉపమాక పాఠశాలలో భోగిమంటలు వేసి హరిదాసు, కొమ్మదాసు, గంగిరెడ్ల వారి వేషధారణలతో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బొమ్మలకొలువు, కోలాటాలను ఏర్పాటు చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థులు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. రంగవల్లులను వేసి పాఠశాల ప్రాంగణాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. చినదొడ్డిగల్లు పాఠశాలలో రవీంద్రనాద్ ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు తప్పెట గుళ్ల ప్రదర్శన నిర్వహించారు. గాలిపటాలను ఎగుర వేశారు. ఎంఈవో కుంచం నరేష్, ఉపాధ్యాయులు వెంకటరమణ, ఎస్.వి.ఎస్ ఆచార్యులు, రమేష్‌బాబు, ఫల్గుణరావు, రాజు పాల్గొన్నారు.

పాయకరావుపేట : మండలంలోని పెదరాంభ్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కోడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంక్రాంతి వేడుకలను జరుపుకొన్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. భోగి మంటలు వేశారు. తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వివిధ రకాల వేషధారణలతో అలరించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ఎస్.రాయవరం: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండగ అని విద్యా కమిటీ చైర్మన్ పినపాల గణేష్ అన్నారు. పెదఉప్పలం ఉన్నత పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల ముగ్గులు తీర్చిదిద్దారు. నృత్యాలతో అలరించారు.

రాంబిల్లి: మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం ఘనంగా సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. గోకివాడ పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎన్.వి. సూర్యనారాయణ సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు భోగి మంటలు వేశారు. పిండివంటలు చేసి ప్రదర్శించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి.

అచ్యుతాపురం : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అచ్యుతాపురం మండలంలోని కైట్స్ విద్యా విహార్‌లో సోమవారం విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. నృత్యాలు చేసి సందడి చేశారు. ముగ్గులు వేసి సంక్రాంతి శోభ తీసుకొచ్చారు. హరిదాసు వేషధారణ ఆకట్టుకుంది.

మునగపాక : వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సంబరాలను సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ సంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలన్నారు. చెరకు గెడల ప్రదర్శన, గాలిపటాల పండగతో పాటు పిల్లలతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంక్రాంతి సంబరాల్లో పాల్గొని సందడి చేశారు.

కోటవురట్ల : సర్కారు బడులకు సంక్రాంతి పండగ ముందే వచ్చేసింది. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి ఉట్టిపడేలా పాఠశాలను అలంకరించారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్లో సంబరం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. విద్యార్థినులకు రంగవల్లికల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ ఖాలీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వాడ్రాపల్లి హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ప్రారంభిస్తున్న సర్పంచ్ నూకరాజు


గోకివాడ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు


అచ్యుతాపురం : హరిదాసు వేషధారణలో విద్యార్థికి బియ్యం వేస్తున్న మహిళలు



అచ్యుతాపురం : ఆకట్టుకున్న సంక్రాంతి ముగ్గులు


నక్కపల్లి : కోలాటమాడుతున్న బాలబాలికలు

క్లుప్తంగా

మామిడి చెట్ల ఫలసాయానికి వేలం

పాయకరావుపేట : పట్టణంలో గల బీఆర్ అంబేడ్కర్ పార్కులో గల 13 మామిడి చెట్ల ఫలసాయానికి 22వ తేదీన వేలం నిర్వహించడం జరుగుతుందని ఏఎస్‌డబ్ల్యుఓ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా వెయ్యి రూపాయిలు ధరావత్తు చెల్లించాలని, వేలం దక్కించుకున్నవారు అదే రోజున మొత్తం సొమ్మును చెల్లించాలని సూచించారు.

ఓటు హక్కుపై అవగాహన

అచ్యుతాపురం : మండలంలోని జగ్గన్నపేటలో భాగవతుల చారిటబుల్ ట్రస్టు(బీసీటీ) ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కలిగించారు. విద్యార్థి బృందాలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ గ్రామంలో చైతన్యం కలిగించారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు ఓటు హక్కుని వినియోగించుకోవాలని అవగాహన కలిగించారు.

చినతీనార్లలో వైద్యశిబిరం

నక్కపల్లి : చినతీనార్లలో ఏపి సాక్స్, చైల్డ్ ఫర్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీము ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్ ప్రసాద్ ఆధ్వర్యంలో 113 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. సుఖవ్యాధులు, హెచ్ఐవీ, టీబీ వ్యాధులపై ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీవారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్‌లు గోవిందరావు, లింక్ వర్కర్లు నర్సింగరావు సర్పంచ్ ముసలయ్య, పాల్గొన్నారు.

మద్యంతో పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదు

యలమంచిలి : అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ కె.సాపినాయుడు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం యలమంచిలి మండలంలో ములకలాపల్లి గ్రామానికి చెందిన రంగాల పైడిరాజు, తురంగలపాలెం గ్రామానికి చెందిన అప్పికొండ సత్యనారాయణ, పరిమితికి మించి అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తుండగా యలమంచిలి పట్టణంలో సోమవారం వారిని పట్టుకుని వారి వద్ద నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనపరుచుకుని వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. పరిమితికి మించి ఎవరైన అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణంపై కేసు నమోదు

మునగపాక : ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మహమ్మద్ అలీ తెలిపారు. గణపర్తిలో ప్రభుత్వ స్థలంలో అదే గ్రామానికి చెందిన గంగాధర్ ఎటువంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టడంతో రెవెన్యూ అధికారులు గతంలో నిర్మాణం ఆపాలంటూ గంగాధర్‌కు తెలిపారు. అయినా గంగాధర్ పట్టించుకోకుండా ఇంటి నిర్మాణం చేయడంతో ఎస్ఐ అలీకి అందిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

10న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కోటవురట్ల : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 10న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

మండల స్థాయి పోటీలను ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో మన్మథరావు

మునగపాక : మండల స్థాయి క్రీడాపోటీలను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీవో ఎం.మన్మథరావు కోరారు. ఈ నెల 10 నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సన్నాహాక సమావేశం నిర్వహించారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు క్రీడలకు అనువైన ప్రాంతాల్లో పోటీలు నిర్వహించాలని, క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సమావేశంలో సూచించారు. ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, ఎంఈవో వేణుగోపాలరావు, సూపరింటెండెంట్ ప్రసాద్, పీఈటీలు పాల్గొన్నారు.

చెరకు సాగులో నూతన వ్యవసాయ ఉపకరణాలు

• రైతుల సమక్షంలో ట్రాష్ ష్రెడ్డర్ ప్రదర్శన


చెరకు ట్రాష్ ష్రెడ్డర్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు

మునగపాక : తంపరమూల ప్రాంతంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం ద్వారా వ్యవసాయంలో నూతన ఉపకరణాలకు సంబంధించి రైతులకు ప్రదర్శన ఇచ్చారు. చెరకు చెత్తను చిన్న చిన్న ముక్కలుగా కటింగ్ చేయడం ద్వారా భూమిలో కుళ్లి ఎరువుగా దోహదపడేలా ట్రాష్ ష్రెడ్డర్ పనిచేస్తుందని పరిశోధన కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ పి.జగన్నాథరావు రైతులకు వివరించారు. చెరకు మడిలో నీటి తేమ తగ్గకుండా ఉండడంతో పాటు చెరకు కార్శి వచ్చేటపుడు మొదళ్లు ఎండిపోకుండా ఉండడం ద్వారా నాణ్యమైన కార్శి మొక్కలు రావడానికి దోహద పడుతుందన్నారు. బెల్లం తయారీ సమయంలో చెరకును అవకాశం ఉన్నంతవరకు పరిశుభ్రంగా తయారు చేసిన తర్వాత క్రషింగ్ చేసి బెల్లం తయారు చేసుకోవాలన్నారు. హైడ్రోస్‌కు బదులుగా మునగాకు రసాన్ని వినియోగించడం ద్వారా మంచి రంగు కలిగిన బెల్లం తయారవు తుందన్నారు. చెరకు విత్తనాలను ఎప్పటికపుడు మార్చడం ద్వారా పంట దిగుబడులు బాగా పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎప్పటికపుడు పరిశోధన కేంద్రంలో ఉండే కొత్త వంగడాలను తీసుకువచ్చి అధిక దిగుబడులు సాధించాలన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకుడు రామారావు, ఎంపీపీ జయలక్ష్మి, సర్పంచ్ దిమ్మల అప్పారావు, శాస్త్రవేత్త శ్రీదేవి, వ్యవసాయాధికారులు రంగాచారి, ఎం.స్వప్న, వీఏఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల హాకీ పోటీలకు జిల్లా జట్టు పయనం


తిరుపతిలో జరగనున్న జూనియర్ హాకీ టోర్నీలో పాల్గొనున్న జిల్లా జట్టు క్రీడాకారులు

యలమంచిలి రూరల్ : తిరుపతిలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ 14వ అంతర్ జిల్లాల జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొనే జిల్లా హాకీ జట్టు క్రీడాకారులు సోమవారం యలమంచిలి నుంచి బయలుదేరి వెళ్లారు. ఆదివారం యలమంచిలి రాజీవ్ క్రీడామైదానంలో జిల్లా జట్టుకు 18 మంది క్రీడాకారులను సెలెక్టర్లు ఎంపిక చేశారు. వీరంతా ఈ నెల 9 నుంచి తిరుపతిలో ప్రారంభం కాబోయే హాకీ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని యలమంచిలి హాకీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. జట్టు మేనేజర్ మళ్ల రూపేష్ నేతృత్వంలో ఆర్.ఎం.ఎస్ దత్తాత్రేయ, సరూప్ కుమార్, ఎ. వెంకటేష్, టి.నాగ గణేష్, బంగారు గణేష్ (గోల్ కీపర్), కొఠారు తేజ, సీహెచ్.చరణ్, ఎం.వెంకటేష్, జె.భానుప్రసాద్, పి.జగదీష్, కె.మహేష్, బి.రామ్‌చరణ్, స్వామి, జి. రాజ్‌కుమార్, కె.మనోజ్, ఎస్.ప్రణీత్, పి.భరత్, కె.సూర్యగణేష్‌లతో కూడిన జట్టు క్రీడాకారులు టోర్నీలో పాల్గొనేందుకు వెళ్లారు. అనకాపల్లి హాకీ సంఘ సభ్యులు ఆడారి వీరునాయుడు, ఏబీఎల్ రాజు, జి.రాంబాబు, ఎం.రూపేష్, భవానీ, వాసు, ఎల్.ప్రసాద్ వారికి వీడ్కోలు పలికారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి


కంబాల జోగులతో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సైనికుల్లా పని చేసి జగనన్నను మరో మారు ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. అడ్డురోడ్డులో సోమవారం నూతన గృహ ప్రవేశం చేసిన ఆయన స్థానిక నాయకులతో సమావేశం అయ్యారు. నిత్యం తాను నియోజకవర్గంలో అందుబాటులో ఉండేందుకు అడ్డురోడ్డులో నివాసం ఏర్పాటు చేసుకున్నానని, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు వెళ్లి కంబాల జోగులును కలిసి పలకరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎస్.రాయవరం మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, ఎంపీపీ లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, వైస్ ఎంపీపీ అప్పన్న, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబు, సర్పంచ్ కర్రి సత్యనారాయణ, శ్రీనుబాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు మహోన్నతం


నక్కపల్లిలో అంబేడ్కర్‌కు నివాళులర్పించిన వీసం తదితరులు


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన చిక్కాల

పాయకరావుపేట : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలు ఎంతో మహోన్నతమైనవని, మనందరం ఆయన ఆశయాలను పాటించాలని ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు అన్నారు. ఈ నెల 19న విజయవాడలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణను పురస్కరించుకుని గ్రామాల్లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పెంటకోట గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ నాగమణి, ఈవోఆర్డీ చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, ఉపసర్పంచ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

నక్కపల్లి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. పంచాయతీ కార్యాలయం వద్ద రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈనెల 19వ తేదీన విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ తెలిపారు.

శభాష్ వలంటీర్


కేజీహెచ్‌లో మంగకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సత్యవతి

మునగపాక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ మెరుగైన ఫలితాలు ఇస్తుంది. తమకు కేటాయించిన కుటుంబాలకు మెరుగైన సేవలను అందిస్తున్నారు. మండలంలోని గంటవానిపాలెం గ్రామానికి చెందిన నందవరపు మంగ అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. దీంతో సంబంధిత వలంటీర్ గంటా సత్యవతి జనవరి నెలకు సంబంధించిన పింఛన్ రూ.3వేలను అందజేసి మానవత్వం చాటుకున్నారు.

మునగపాకలో వాహన తనిఖీలు

మునగపాక : మునగపాక మెయిన్‌రోడ్డులో సోమవారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. పూడిమడక రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న కార్లు, ఆటోలను ఎస్ఐ మహమ్మద్ అలీ షరీఫ్ తనిఖీ చేశారు. ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడిపినా అలాగే నగదు తరలించినా చర్యలు తప్పవన్నారు. అనధికారికంగా మద్యం తరలిస్తున్నా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్ఐ మన్మథరావు, పోలీసు సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మేలు కొలుపులు

మునగపాక : మండలంలోని చూచుకొండలో మేలుకొలుపుల కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ధనుర్మాసంలో భాగంగా గత నెల 16న ప్రారంభమైన మేలుకొలుపులు భోగిపండగ వరకు నిర్వహించనున్నారు. పురుషులు, మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి మేలుకొలుపులను చేపట్టారు. ఉదయం నుంచి భక్తులు మేలు కొలుపుల కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల-అందలాపల్లిలో సోమవారం ధనుర్మాస మేలుకొలుపులు నిర్వహించారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేలుకొలుపులలో భాగంగా భజనలు చేసుకుంటూ భక్తులు గ్రామంలో సంచరించారు. కార్యక్రమంలో కొల్లి అప్పారావు, గుడివాడ రమణ, కట్టమూరి అప్పారావు, వెంకటరమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి


ఘటనా స్థలంలో ప్రసాద్ మృతదేహం

అచ్యుతాపురం : మండల కేంద్రంలో బజాజ్ షోరూం వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పరవాడ మండలం చింతల గొర్లె వానిపాలేనికి చెందిన గొర్లె ప్రసాద్(36) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బంధువు బి.లోకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ బుచ్చిరాజు అందించిన సమాచారం ఇలా ఉంది. చింతల గొర్లెవానిపాలేనికి చెందిన ప్రసాద్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను సోమవారం ఉదయం స్కూటీపై వెళుతుండగా, లారీ(ఏపీ31టీడబ్ల్యూ3345) ఢీకొనడంతో ముందు టైరు కింద పడి మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

వేంపాడు వద్ద చెక్‌పోస్టు

నక్కపల్లి: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. సోమవారం జాతీయరహదారిపై వేంపాడు టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. నక్కపల్లి సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణ్‌రావు సిబ్బందితో కలిసి జాతీయరహదారిపై రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో డబ్బులు, మద్యం తరలించే అవకాశం ఉండటంతో ఈ చెక్‌పోస్టును తాత్కాలికంగా ఏర్పాటు చేసినట్టు పోలీసు అధికారులు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యంతో భూ ఆక్రమణలు

మునగపాక : నీటి పారుదల సంస్థకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పేటకట్టు రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. ఇప్పటికే అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇందుకు స్పందించిన అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు మళ్ల సంజీవరావు, కొండలరావు, పెద జగ్గప్పారావు, చిన జగ్గప్పారావు పాల్గొన్నారు.